

# కలకంఠి కథలు

## - శ్రీధర



ఈ కథల గురించి:

*1992లో ఈనాడులో వసుంధర పేజీ ప్రారంభించారు. స్త్రీలకు సంబంధించిన అంశాల కోసం. రామోజీరావు గారి సూచనలతో ఎడిటర్ వర్మగారు ప్రతి గురువారం ఒక వుమన్ ఓరియెంటెడ్ ఆర్టికల్ ఉండాలని నిర్ణయించారు. అప్పటికే శ్రీధర విష్ణుప్రియ కాలమ్ రాస్తున్నారు. అందుచేత స్త్రీలకు ఆసక్తికరంగా ఉండే ఒక ఆర్టికల్ రాయమని శ్రీధరని అడిగారు. మర్నాడు ఆర్టికల్ రాసిచ్చారు. దానిపేరు 'అమ్మకు ఎన్నడన్నా థాంక్స్ చెప్పారా?', బాగానే ఉందనిపించినా, రెస్పాన్స్ ఎలా ఉంటుందో నన్న చిన్న అనుమానం వర్మగారికి ఉండనే ఉంది. కానీ ఆ రాత్రి కంపోజింగ్ చేసినవాళ్లూ, పేజీ మేకప్ చేసినవాళ్ళు 'ఆగి, కళ్లు తుడుచుకున్నాం 'అని చెప్పినప్పుడు ఆయన అనుమానం నివృత్తి అయింది. అచ్చయ్యాక, చదివిన ప్రతివాళ్లూ, అవునూ, మా అమ్మ మా కోసం ఎంతో చేసింది, థాంక్స్ చెప్పాలన్న ఆలోచనే రాలేదు ' అని అన్నారు. తర్వాత వరసగా నాలుగు వారాలు ఇంకా ఎన్నాళ్లు నాకీ సంకెళ్ళు? 'దయచేసి అనాగరికుల అడ్రస్ చెప్పండి, 'ఇల్లాలి హృదయవేదనా నివేదన 'రాశారు. అనూహ్యమైన స్పందన వచ్చింది. 'నేను వ్యాసాలు రాయించాలనుకున్నాను, మీరు రాసిన వ్యాసాలు కథల్లానే ఉంటున్నయి, ఇంక కథలే రాయండి...' అన్నారు వర్మగారు. స్త్రీలకు సంబంధించిన పేజీ కనుక 'మల్లిక' పేరుతో ప్రతి గురువారం ఒకటి కాదు, రెండు కాదు నాలుగు వందల ఆణిముత్యాల్లాంటి కథలు ఒక దశాబ్దం  పాటు ఏకబిగిన రాశారు. చాలా మందికి ఎవరీ మల్లిక, అన్న ప్రశ్న ఎదురైంది. ఈనాడుకు ఫోన్ కాల్స్ చేసినవారిలో ఎంతో మంది ప్రముఖులూ ఉన్నారు.*

*ఎందరో సాహిత్యాభిమానులను గురువారం ఉదయం కోసం వసుంధర పేజి కోసం ఎదురు చూసేలా  ఆసక్తి కలిగించిన శ్రీధర (మల్లిక) కథలు, కౌముది పాఠకుల కోసం ముఖ్యంగా నవతరం కోసం... ప్రతి నెలా.. చదవండి.!!*

# జనారణ్యంలో హరిణి

ఆ ఊరు ఒక జనారణ్యం అయితే అందులో  సింహంలా తిరుగుతుంటాడు నరసిమ్మ.  అడవిలో సింహం తిరుగుతున్నప్పుడు చిన్న జంతువులన్నీ భయపడి పారి పోతుంటాయి. ఆ ఊరిలోనూ అంతే.  వాడిని చూడగానే చిన్న చిన్న మనుషులంతా పక్కకు తప్పుకుని తిరుగుతింటారు.

నరసిమ్మకి నిండా పాతికేళ్ళు ఉండవు. కానీ అతని చరిత్ర మాత్రం ప్రసిద్ధి కెక్కింది. ఇప్పటికి నలుగురిని హత్య చేసాడు. అయిదుగురి ఆస్తుల్ని స్వాహా చేసాడు. అయినా  అతని మీద ఒక్క కేసు కూడా నమోదు కాలేదు.  కేసు బుక్కు చేస్తే పోలీసోడ్ని లేపీ

గలను ... అంటాడు పబ్లిగ్గానే. పోలీసూ మనిషే. వాడికీ ప్రాణం అంటే తీపే గదా. ఎవడైనా కోర్టు లో కేసు వేస్తే తిరిగి అ ఊళ్ళో కాలు పెట్టలేదు. వాడి మాట కాదన్న వాడిని చితక తన్నాడు. నన్ను కాదంటే ఎవడికైనా ఇలాగే అవుద్ది... అని జనాంతికంగా అంటుంటాడు.

కొంత మంది వాడి పక్కన చేరటంతో వాళ్ళందరికీ వాడు గురువు అయి పోయాడు. అందుచేత పట్టపగలే చుక్కలు మొలిపించ గలుగు తున్నాడు. "మన మాట ఇనక పోతే శాల్తీ గల్లంతు అయిపొద్దని చెప్పు ..." అని రోజూ బెదిరిస్తూ ఉంటాడు.

అదే ఊళ్ళొ హరిణి కూడా ఉంటొంది. హరిణి కుటుంబరావు కూతురు. కుటుంబరావు పోస్ట్ మాస్టరు. ఆయన ప్రతి విషయం లోనూ అతి జాగ్రత్తగా ఉంటాడు. ఏ పని చేస్తే ఏ ప్రమాదం ముంచు కొస్తుందోనని ముందుగానే ఊహించి రాబొయే ప్రమాదాలకు ఆమడ దూరం లో ఉంటాడు. ఆయన భార్య సావిత్రమ్మ కూ అదే పిరికితనం అలవాటు అయింది.

హరిణి ఈ కాలం పిల్ల కాబట్టి కళ్ళు మూసీ, కళ్ళు తెరిచీ కలలు కనటం అలవాటు చేసుకుంది. ఆ కలల్లో మేనత్త కొడుకు శ్యామలరావు, మేనమామ కొడుకు సుందరం వచ్చి ఆమె పక్కన నిలబడతారు. శ్యామలరావు కాబోయే డాక్టరు. అందంగా హీరోలా ఉంటాడు. సిటీలో రెండు మేడలున్నయి. రెండు కార్లు ఉన్నయి. అతన్ని వలచి వలపింప చేసుకుంటే జీవితం నందనవనం అవుతుందని ఆమె ఆశ. ఇక సుందరం ఇంజనీరింగ్ చదువుతున్నాడు. అతనికి బంగారు భవిష్యత్తు ఉంది. సుందరాన్ని చేసుకున్నా జీవితం వెన్నెల్లో బృందావనం లా ఉంటుంది. కాసేపు మేనత్త కొడుకు తోనూ, మరి కాసేపు మేనమామ కొడుకు తోనూ అలాఅలా కలల్లో విహరించి వస్తుంటుంది.

ఈ లోగా పొయ్యి మీద పాలు పొంగి పోవటం, కుళాయి కింద పెట్టిన బక్కెట్ నిండి నీళ్ళు పొర్లి పోవటం లాంటి చిన్నచిన్న పొరపాట్లు జరిగినా అవన్నీ ఆ అమ్మాయికి శుభ సూచనలలాగానే కనిపిస్తున్నయి. కాకపోతే తల్లి వెనక నుంచి స్తోత్రాలు చదువు తుంటుంది. ' నిన్ను ఎవడు కట్టుకుంటాడో గానీ వాడికి వేళకి తిండీ తిప్పలు ఉండవు. ' అని. కానీ ఆ అమ్మాయి మాత్రం 'మనకేమి ? మన లైఫ్ బెడ్డాఫ్ రోజెస్ ...' అనుకుంటుంది. అప్పుడు ఆమె కళ్ళ ముందు పెద్ద పరుపు... దాని మీద గులాబీల మీద నడిచి వెళ్ళటం లాంటి దృశ్యాలు ... ఇటునుంచి శ్యాం ... అటునుంచి సుందరం ... వచ్చి ఆమెకు చెయ్యి అందిస్తూ ఉంటారు. ఎటూ తేల్చు కోలేక సిగ్గుల మొగ్గ అయి పోతుండగా తల్లి గొంతు వినిపిస్తుంది. "ఓసి...నీ పరధ్యాన్నం పాడుగాను... కూర మాడి పోయి వాసన వస్తున్నదే..." అని.

ఒక రోజు హరిణి స్నేహితురాలి ఇంటికి వెళ్ళి వస్తుంటే ఎదురుగా నరసిమ్మ కనిపించాడు. " ఈ పిల్ల ఎవరు నన్ను లెక్క జేయకుండా ఎల్తుంది...?" అన్నాడు.

" పోస్టు మాస్టరు కూతురు గురూ " అన్నాడు పక్కన ఉన్న వాడు. "దీన్ని ఒక చూపు చూడాలి" అన్నాడు.

స్కూటరు వెనక్కి తిప్పి హరిణి తగిలేటట్టు పక్కనుంచి రాసు కుంటూ వెళ్ళాడు. "మీద పడతావేమి ? కళ్ళు కన పడటం లేదా ? " అన్నది.

"కళ్ళు కనబట్టే కదా నీ మీద పడ్డది" అన్నాడు వాడు.

"షటప్" అన్నది హరిణి.

"అంటే ఏమిట్రా ?" అని శిష్యుడిని అడిగాడు.

" నోరు ముయ్యమంటోంది గురూ " అన్నాడు పక్కన ఉన్న వాడు.

" దాని నోరు మన నోటితో మూస్తే ఎలా గుంటది రా? "

" భేషుగ్గా ఉంటది గురూ..." అన్నాడు శిష్యుడు.

నడి రోడ్డు మీద ఒక ఆడ పిల్లని అవమానిస్తుంటే అంతా కళ్ళు అప్పగించి చూసారే గానీ, అడ్డు కోవటానికి ఎవరూ ముందుకు రాలేదు.

జరిగిన సంఘటన క్షణాల్లో ఊరంతా తెలిసి పోయింది.

కుటుంబరావు కు తల కొట్టేసినట్లు అయింది. సావిత్రమ్మ ఏడుస్తూ తనలో తనే కుమిలి పోసాగింది. హరిణి ఆ షాక్ నుంచి కోలుకోవటానికి రెండు రోజులు పట్టింది. ఒక పక్క ఆవేశం మరో పక్క అవమానం ఆమెను క్రుంగ దీస్తున్నయి. వాడి అంతు తేల్చుకోవాల్సిందే నని నిర్ణయించు కొని పోలీస్ స్టేషన్ కి వెళ్ళి రిపోర్ట్ ఇచ్చింది.

" సంఘటన జరిగిన రెండు రోజుల తరువాతనా నీకు తీరుబడి అయింది? ఇంతకీ ఇందుకు సాక్షులు ఎవరైనా ఉన్నారా ? " అని అడిగారు పోలీసులు.

అందరూ చూస్తుండగానే ఇది జరిగినా, ఆమె వత్తాసుగా సాక్ష్యం చెప్పటానికి ఎవరూ ముందుకు రాలేదు. సాక్ష్యం లేనిదే ఇందులో మేము చేయగలిగింది ఏమి లేదని అన్నారు పోలీసులు.

ఈ విషయాలన్నీ తెలిసినాక నరసిమ్మ మరింత రెచ్చిపోయాడు.

కుటుంబ రావు, సావిత్రమ్మ కూతురునే మందలించారు. " ఆ రౌడీ వెధవ తో నీకు ఎందుకే ?" అని ఆమెను నిరుత్సాహ పరచారు. హరిణి ఊరుకోలేక పోతున్నది. కానీ ఏమీ చేయ లేక పోతున్నది.

కుటుంబరావు తమ్ముడు చని పోయాడు. ఆయన ఊరికి వెళ్ళాడు. ఇంట్లో సావిత్రమ్మ, హరిణి ఉన్నారు.

సావిత్రమ్మ కూరగాయల కోసం బజారుకు వెళ్ళినప్పుడు, నరసిమ్మ వాళ్ళ ఇంట్లో చొర బడ్డాడు.

ఒంటరిగా నున్న హరిణి పై అత్యాచారం చేశాడు.

ఆమె రోదన అరణ్య రోదన అయింది. ఆమె కేకలు విని పరుగెత్తుకొని వచ్చిన ఇరుగు పొరుగు వాళ్ళు ఇంటి ముందున్న రౌడీలను చూసి లోపలికి వెళ్ళి పోయారు.

జరగ కూడనిది జరిగి పోయింది. జనారణ్యం లో హరిణి ఒక క్రూర మృగం అహానికి బలి అయిపోయింది.

కుటుంబరావు వచ్చాడు. జరిగినది తెలుసుకున్నాడు. కానీ ఆయన ఏమీ చెయ్య లేక పొయ్యాడు. పోలీసులకు కంప్లైంట్ ఇచ్చినా మరింత అల్లరి కావటం తప్ప ఒరిగేదేమీ లేదని అర్ధం అయింది.

జీవచ్చవాల్లా మారి పోయిన ఆ ముగ్గురికీ నరసిమ్మ పంపిన కబురు పిడుగు పాటులా తోచింది.

"నీ కూతురు ఎలాగూ నా చేతిలో చెడిపోయింది. దానికి ఇంక పెళ్ళి కాదు మీరు పెళ్ళి చెయ్యాలని చూసినా నేను ఉన్నంత వరకూ అది జరగదు. ఎవడన్నా ముందుకు వచ్చినా వాడిని లేపేస్తాను.... అందు చేత దాన్ని నాకు ఇచ్చి పెళ్ళి చెయ్యటం మినహా మీకు మరో దారి లేదు."

ఇదీ నరసిమ్మ నుంచి వచ్చిన కబురు.

ఇంత బరి తెగించిన వెధవకు ఇచ్చి పెళ్ళి చెయ్యతానికి వాళ్ళు ఎంత మాత్రం అంగీకరించటం లేదు. అసలు ఆ ఊహనే భరించ లేకుండా ఉన్నారు. చావటానికైనా సిద్ధమే కానీ, ఇంత దిగజారి పోవటానికి వాళ్ళు సిద్ధంగా లేరు. ఏమి జరిగినా ఎదుర్కోవటానికి మానసికంగా తయారవుతున్నారు.

ఎన్నో ఊహించుకున్న హరిణి.... శ్యాం తోనో, ... సుందరం తోనో ,,,జీవితాన్ని పంచుకోవాలని ఎన్నో కలలు కన్న హరిణి... ఒక వీధి రౌడీ తో తన జీవితాన్ని ఊహించుకోలేక పోతున్నది.

వీళ్ళు ఇలా సత మత మవు తుండగానే నరసిమ్మ పెళ్ళికి ముహుర్తం పెట్టి కబురు చేసాడు.

పది రోజుల్లో పెళ్ళికి సిద్ధం కావాలని కబురు చేసాడు.

ఏమి చెయ్యాలో తెలియని స్తితి లో కుటుంబరావు ఉండగా, హరిణి చెప్పింది.

" నేను ఈ పెళ్ళికి ఒప్పు కుంటున్నాను ..."

ఆయన అశ్చర్యం లో నుంచి తేరు కోక ముందే మిగిలిన వన్నీ జరిగి పోయినయి.

నిశ్చితార్ధం జరిగింది. ఆ రోజు నరసిమ్మతో పాటు అతని మిత్రులు కొద్ది మంది వచ్చారు. అందరూ కుటుంబరావు ఇంట్లో భోజనాలు చేసారు.

ఆ సాయంత్రమే నరసిమ్మను అసుపత్రి లో చేర్చారు.

" ఫుడ్ పాయిజనింగ్ జరిగింది " అన్నాడు డాక్టర్. ఆసుపత్రికి తీసుకు వెళ్ళేటప్పటికే చాలా అలస్యం అయింది. ఆ రాత్రి నరసిమ్మ చనిపోయాడు.

ఈ విషయం తెలిసి కుటుంబరావు దంపతులు నివ్వెర పోయారు. ఆ ఊరి వాళ్ళు మాత్రం "పీడ విరగడ అయింది" అనుకున్నారు.

" ఏమిటే ఇది ?" అని అడిగింది హరిణి తల్లి.

"నేనే వాడికి విషం కలిపి పెట్టాను ... నా జీవితం లో వాడు విషాన్ని చిందించాడు. నేనూ వాడి జీవితంలో అదే చేశాను. పోలీసులూ,, కోర్టులూ, ఈ ఊరి పెద్దలూ ఎవరూ ఏమి చెయ్యలేక పోయారు. ఒక వీధి రౌడి ఆడింది ఆట, పాడింది పాటగా జరుగుతుంటే, అందరూ చోద్యం చూస్తూ ఉన్నారు. పాము పడగ విప్పుతుంది. మనం భయపడి పారి పోతున్నాం. దానికి పాలుపోసినట్లే పోసి, దాన్ని చంపితే అది మరింత మందిని కాటు వెయ్య కుండా కాపాడ వచ్చు.అదే చేశాను." అన్నది హరిణి.

నరసిమ్మ శిష్యుల దృష్టి లో హరిణి హంతకురాలు. కానీ ఆ ఊరి వాళ్ళ దృష్టి లో ఆమె ఒక రాక్షసుడిని సంహరించిన కాళికా దేవి. .

★★★★★★★★★★★★★★

(వచ్చేనెల మరో కథ)

Click here to share your comments on this story.